యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

ఝరాసంగం, జూన్ 22: యువత మత్తు పదార్థాలకు బానిసలుగా భవిష్యత్ నాశనం చేసుకోవద్దని ఎస్సై-2 మల్లేశ్వర్ అన్నారు. యాంటీ-డ్రగ్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని ఎల్గోయి గ్రామంలో మత్తు పదార్థాలతో కలిగే దుష్ప్రభావాలు, చట్టపరమైన చర్యలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామంలోని ఈదమ్మ గుడి నుంచి పంచాయతీ కార్యాలయం వరకు గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ గుండప్ప, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బాబుమీయా, పోలీసు సిబ్బంది శ్రీనివాస్, భారత్ గౌడ్, సత్యనారాయణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతుధర్నాతో దిగొచ్చిన కాంగ్రెస్ సర్కార్

జిన్నారం, జూన్ 22: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతుభరోసా డబ్బులు ఇవ్వకుంటే ఔటర్ రింగ్ రోడ్డును దిగ్బందిస్తామని మాజీ మంత్రి సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హెచ్చరించి 24గంటలు గడవక ముందే ప్రభుత్వం దిగివచ్చింది. పటాన్ చెరువు నియోజకవర్గంలోని రైతులకు ప్రభుత్వం రైతుభరోసా నిధులు నిలిపివేయడంపై బీఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో జిన్నారంలో నిర్వహించిన రైతు మహాధర్నా కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొని ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. 22వేల మంది రైతుల కు రైతుభరోసా నిధులు విడుదల చేయాలని ధర్నా నిర్వహించారు. దీంతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 1.20 లక్షల ఎకరాల భూమికి రైతుభరోసా వర్తింపజేస్తామని, రెండు, మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో జమచేస్తామ న్నారు. కేవలం సాగు భూములకే ఈ పథకం వర్తింపజేయాలనే ఉద్దేశంతోనే రైతుభరోసా ఆలస్యమైందని వివరణ ఇచ్చారు. బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు సంతో షం వ్యక్తంచేస్తున్నారు.

ఉచిత వైద్యశిబిరం సక్సెస్

గ్రామస్తులను పరీక్షిస్తున్న వైద్యుడు

జిన్నారం, జూన్ 22: గడ్డపోతారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ లయన్స్ క్లబ్, పారిశ్రామికవాడలోని లీ ఫార్మా పరిశ్రమ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరాన్ని మాజీ సర్పంచ్ పులిగిల్ల ప్రకాశం చారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ... ప్రతి ఏటా మెడికల్ పరిశ్రమతో కలిసి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి పేదలకు ఉచితంగా వైద్యం అందించడం అభినందనీయమన్నారు. లయన్స్ ఐ దవాఖాన వైద్యబృందం సభ్యులు గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీచేశారు. అనంతరం మాజీ సర్పంచ్‌ను క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కోమల్ రెడ్డి, నరేందర్ బాబు, ఎమ్మెస్ రెడ్డి, మౌలాలి గ్రామస్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇందూర్ అక్కమాదేవి ఆశ్రమం పీఠాధిపతి చెన్న మల్లికార్జున స్వామి యోగి

ప్రతి ఒక్కరూ బసవ ధర్మం పాటించాలి

రాయికోడ్, జూన్ 22: సమజంలో ప్రతి ఒక్కరూ బసవ ధర్మం పాటించాలని ఇందూర్ అక్కమాదేవి ఆశ్రమం పీఠాధిపతి చెన్న మల్లికార్జున స్వామి యోగి అన్నారు. ఆదివారం రాయికోడ్ మండలం శ్రీ వీరభద్రేశ్వరా స్వామి ఆలయంలో మండలస్థాయి వీరశైవ లింగాయత్ అధ్యక్షుడిగా పి.సంగమేశ్వర్‌పాటిల్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, కార్యదర్శిగా సంగమేశ్వర్, యూత్ అధ్యక్షుడిగా సంగమేశ్వర్‌ను ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పి.సంగమేశ్వర్‌పాటిల్ మాట్లాడుతూ... మండలంలోని అన్ని గ్రామాల్లో వీరశైవ లింగాయత్ సంఘాలను ఏర్పాటుచేస్తున్నామన్నారు. సమావేశంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సిద్దన్నపాటిల్, మాజీ జెడ్పీటీసీ మల్లిఖార్జున్ పాటిల్, మాజీ సర్పంచ్‌లు బస్వరాజు పాటిల్, కేదారినాథ్ పాటిల్, సుభాష్ పాటిల్, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్, జిల్లా, రాష్ట్ర కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

జిన్నారం, జూన్ 22: కంటి సమస్యతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని వైఎస్సార్ కాలనీలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి వివరాల ప్రకారం... వైఎస్సార్ కాలనీలో కొంతకాలంగా నివసిస్తున్న గొల్ల గణేశ్ (55) కంటి సమస్యతో బాధపడుతూ చికిత్స నిమిత్తం పలు ఆస్పత్రుల్లో చూపించుకున్నాడు. అయినా తగ్గకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఈనెల 21న రాత్రి తన ఇంట్లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులకు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అధ్వానంగా వసతి గృహాలు

సాంఘిక సంక్షేమ వసతి గృహాల నిర్వహణ అగమ్యగోచరంగా మారిం ది. హాస్టళ్ల ఆవరణలు చెత్తా, చెదారం, మురుగు నీటితో నిండి పోతున్నాయి. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ఎవరూ శ్రద్ధచూపడం లేదు. దీంతో హాస్టల్ విద్యార్థులు బిక్కుబిక్కు మంటూ కాలం వెల్లదీస్తున్నారు. అడిగేవారు లేక సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

బాలుర హాస్టల్ వద్ద మురుగు, చెట్ల పొదలు

ఇబ్బందులను తెలుపుతున్న వాచ్‌మెన్ శ్యామ్

కోహీర్, జూన్ 22: సంగారెడ్డి జిల్లా కోహీర్ పట్టణంలో బాలికలు, బాలుర ఎస్సీ సంక్షేమ వసతి గృహాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో హాస్టళ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. సమీపంలోని ఇళ్లలో వాడే నీరంతా హాస్టల్ పరిసర ప్రాంతాలకు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో హాస్టళ్ల ఆవరణలు చెత్తాచెదారం, మురుగునీటితో దర్శనమిస్తున్నాయి. ప్రధాన దారి పక్కన ఇలాంటి దుస్థితి కనిపిస్తుండడంతో పాటు దోమలు, ఈగలతో విద్యార్థులు ప్రతీ రోజు సహవాసం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆహ్లాదకర వాతావరణంలో చదువుకోవాల్సిన విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు. హస్టల్ ప్రహరీల నిర్మాణం సరిగ్గా లేక పశువులు ప్రవేశిస్తున్నాయి. ముళ్లపొదలు ఏపుగా పెరగడంతో విష సర్పాలు, కీటకాలకు నిలయంగా మారాయి.

పట్టించుకోని అధికారులు...

కోహీర్ పట్టణంలోని బాలుర, బాలికల హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించేవారు కరువయ్యారు. చెత్తతో పాటు ముళ్లపొదలు తొలగించాలని మున్సిపల్ అధికారులకు అనేకసార్లు విన్నవించినా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. సిబ్బంది కొరతతో పాటు ఉన్న సిబ్బందికి వేతనాలు సకాలంలో అందక నిరాశతో విధులు నిర్వహిస్తున్నారు. పారిశుధ్య కార్మికుల సంఖ్య తక్కువగా ఉండడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయి. హాస్టల్ వార్డెన్ వెంకటేశంను వివరణ కోరగా కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.16లక్షలు మంజూరయ్యాయని నిధులు రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు.

ఇబ్బందులు తొలిగించాలి

హాస్టల్ ఆవరణలో ఆటలు ఆడుకునేందుకు చాలా ఇబ్బందిగా ఉంది. బయటి నుంచి మురుగు నీరు వస్తుండడంతో పాటు కాంపౌండ్ వాల్, గేటులేక ఆటలు ఆడుకోలేక పోతున్నాం. అధికారులు వచ్చి మా ఇబ్బందులు తొలిగించాలి.

– సంకేశ్ రాథోడ్, కోహీర్ బాలుర హాస్టల్ విద్యార్థి

అర్ధాంతరంగా ఇందిరమ్మ మోడల్ ఇల్లు

- నిధులు లేక?
- అధికారుల నిర్లక్ష్యమా?

మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణం దుస్థితి

ఝరాసంగం, జూన్ 22: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి మండల కేంద్రంలో మోడల్ ఇంటిని నిర్మించి.. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ఆదర్శంగా నిలిచేలా పనులు ప్రారంభించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఝరాసంగం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు మోడల్ ఇంటి నిర్మాణం పనులు ప్రారంభించి స్లాబ్‌వేశారు. కానీ నెలలు గడుస్తున్నా మిగిలిన పనులు పూర్తి చేయకపోవడంతో అర్ధాంతరంగా నిలిచిపోయింది. ఇందుకు కారణం నిధుల లేమా? లేక అధికారుల నిర్లక్ష్యమా? అని తెలియడం లేదు. ఈ మోడల్ ఇంటికి తలుపులు అమర్చకపోవడంతో పశువులకు నిలయంగా మారింది. వివిధ పనుల నిమిత్తం తహసీల్దార్, ప్రజాపరిషత్ కార్యాలయాలకు వచ్చేవారు ఈ ఇంటి ఆవరణను మూత్రశాలగా ఉపయోగించుకోవడంతో పరిసరాలు దుర్గంధంగా మారాయి. ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించే అధికారులే ఈ మోడల్ ఇంటి నిర్మాణం గురించి పట్టించుకోకపోవడంతో పలువురు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మోడల్ ఇంటి నిర్మాణం పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలను అధికారులు సక్రమంగా నిర్వహించాలని కోరుతున్నారు.

మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్, జూన్ 22: కల్హేర్ మండల పరిధిలోని ఖానాపూర్ కే గ్రామానికి చెందిన ఉప్పరి లక్ష్మణ్, ఖాదర్ అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న నారాయణ ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి వారి ఇంటికివెళ్లి మృతికి గల కారణాలు తెలుసుకొని బాధిత కుటుంబ సభ్యుల ను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు గోపాల్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు ఉప్పరి బాలరాజు, మోహన్, బ్రహ్మం ఉన్నారు.

హన్మంత్ రెడ్డికి సన్మానం

హన్మంత్ రెడ్డిని సన్మానిస్తున్న జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు

సంగారెడ్డి/గుమ్మడిదల జూన్ 22: రాష్ట్ర వాలీబాల్ కార్యదర్శిగా, జాతీయ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన హన్మంత్ రెడ్డిని జిల్లా వాలీబాల్ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించారు. ఆదివారం హైదరాబాద్‌లోని హన్మంత్‌రెడ్డి ఇంటికి వెళ్లి శాలువా, పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అభివృద్ధికి కృషిచేయాలని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణ, ఉపాధ్యక్షుడు మచ్చేందర్, కోశాధికారి వెంకటేశం, గౌసోద్దీన్, దాసు, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

కబ్జా కోరల్లో బృహత్ పట్టణ ప్రకృతి వనం

- పార్కులో అక్రమంగా రోడ్డు నిర్మాణం
- పట్టించుకోని అధికారులు

బృహత్ పట్టణ ప్రకృతి వనంలో అక్రమంగా నిర్మిస్తున్న రోడ్డు

జిన్నారం, జూన్ 22: బీఆర్ఎస్ హయాంలో పట్టణ ప్రజల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బృహత్ పట్టణ ప్రకృతి వనాలు కబ్జా కోరోల్లో చిక్కుకుంటున్నాయి. బొల్లారం మున్సిపాలిటీలో ఏర్పాటుచేసిన బృహత్ పట్టణ ప్రకృతి వనం నేడు కబ్జాకు గురవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశ్రామికవాడలోని నాలుగో వార్డు సర్వేనెంబర్ 81, 84లో ప్రకృతి వనం ఏర్పాటుకు 2021-22 లో మున్సిపల్ అధికారులు గతంలోనే రూ. 20లక్షలు కేటాయించగా, రూ.14.98 లక్షలు పార్కు అభివృద్ధికి వినియోగించారు. 2022-23లో రూ.4 లక్షలు కేటాయించి పార్కులో కొంతమేర మిగిలిన పనులు చేపట్టినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈక్రమంలో పార్కులో గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పార్కులోని స్థలాన్ని కొందరు వ్యక్తులు తమ వాణిజ్య అవసరాల నిమిత్తం ఆక్రమించుకోవాలని, రెవెన్యూ రికార్డుల్లో లేని రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారని వాపోతున్నారు. ఈ వ్యవహారంపై మున్సిపల్ అధికారులు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోందని అనుమానిస్తున్నారు. విలువైన ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉందని అన్నారు. అధికారులు కబ్జాకు గురవుతున్న పార్కు స్థలాన్ని అక్రమార్కుల నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి

- మంత్రసానిగా గ్రామంలో సేవలు
- మట్టిపాత్రల్లోనే వంటలు

కల్హేర్, జూన్ 22: సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం మార్డి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు ఆదివారం మృతిచెందింది. పందిరి కేశవ్వకు ముగ్గురు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు కాగా వీరందరికి వివాహమైంది. అయితే భర్త నారాయణ 25ఏళ్ల క్రితం మృతిచెందగా, ఆ తర్వాత ఇద్దరూ కొడుకులు ఇద్దరూ కూతుళ్లు చనిపోయారు. ఆమె నిత్యం మట్టిపాత్ర ల్లోనే భుజిస్తుండడంతో పాటు గ్రామంలోని ఎంతో మంది మహిళలకు పురుడు పోసిందని, మంత్రసానిగా సాధారణ ప్రసవాలు చేసేదని గ్రామస్తులు తెలిపారు. కేశవ్వ 110 ఏళ్లు జీవించి ఆదివారం మృతిచెందడంతో గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు.

నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడి

కంది, జూన్ 22: సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని గ్రామానికి చెందిన నాలుగేళ్ల చిన్నారిపై యువకుడు లైంగికదాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వరుసకు మేనమామ అయిన యువకుడే ఈ ఘటుకానికి పాల్పడినట్లు పోలీసుల తెలిపారు వివరాల్లోకి వెళితే... చిన్నారి తల్లి అనారోగ్యం కారణంగా ఆస్పత్రికి వెళ్తుండగా పాపను పక్కింటికి వెళ్లి ఆడుకోమ్మని చెప్పి వెళ్లిపోయింది. గమనించిన యువకుడు చిన్నారిని ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడిచేసి పారిపోయాడు. ఈక్రమంలో పాప ఏడుస్తూ ఇంటికి వెళ్లడంతో విషయం తెలుసుకున్న తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా చిన్నారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని నిందితుడు పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

వాహనాలు తుక్కు..తుక్కు!

- కొనుగోళ్లపై సదాశివపేట బల్దియా ఎనలేని శ్రద్ధ
- వినియోగంపై అశ్రద్ధ
- వాహనాలు స్క్రాప్‌గా మారుతున్నా పట్టించుకోని అధికారులు

మున్సిపల్ కార్యాలయం ఆవరణలో తుప్పుపడుతున్న ఆటోలు

సదాశివపేట, జూన్ 22: సదాశివపేట బల్దియా అధికారులు పారిశుధ్యం నిర్వహణపై శ్రద్ధ చూపడంలేదు. ఇష్టారాజ్యంగా ఆటో ట్రాలీలు, డస్ట్‌బిన్‌లు, ట్రాక్టర్లు కొంటూ వినియోగంపై అశ్రద్ధ చూపుతున్నారు. వాహనాలు కొనుగోలు చేసిన కొంతకాలానికే పక్కకు పడేసి, కొత్తవాటిని కొనుగోలు చేస్తూ ప్రజాధనం వృధా చేస్తున్నారు. కొనుగోలు చేసిన వాహనాలు వాడుకలో లేక స్క్రాప్‌గా మారి కార్యాలయం ఆవరణలో తుప్పుబడుతున్నాయి. దీంతో స్థానిక ప్రజలు బల్దియా అధికారులపై మండిపడుతున్నారు. కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు కుమ్మక్కై పట్టణ ప్రగతి, ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులను దుబారా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాంకేతిక కారణాలతో కండిషన్ దెబ్బతిన్న వాహనాలను రిపేర్ చేయిస్తే కొత్త వాహనాలు కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదని పలువురు అభిప్రాయపడుతున్నారు. కాలం చెల్లిన, తుప్పుబట్టిన వాహనాల కోసం టెండర్లు పిలిచి స్క్రాప్‌గా విక్రయిస్తే బల్దియాకు ఆదాయం సమకూరే అవకాశం ఉందని ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

స్క్రాప్ దుకాణంలో కార్మికుడి మృతి..

- మిషన్‌లో పడి నుజ్జునుజ్జయిన వైనం
- కేసు నమోదు చేసిన పోలీసులు

రామచంద్రాపురం,జూన్ 22: స్క్రాప్ దుకాణంలో ఓ కార్మికుడు మిషన్‌లో పడి నుజ్జునుజ్జయిన ఘటన ఆర్సీపురం పోలీస్‌స్టేషన్ పరిధి కానుకుంటలో చోటు చేసుకుంది. ఇన్స్పెక్టర్ జగన్నాథ్ వివరాల ప్రకారం.. యూపీకి చెందిన రాజు(22) మూడేళ్లుగా కానుకుంటలోని వెంకటరమణ వర్క్‌షాప్‌లో పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే ఇనుము కత్తిరించే మిషన్‌కి గ్రీస్ రాస్తుండగా షర్ట్ మిషన్‌లో చిక్కుకుని అతన్ని లాగడంతో అందులో పడి నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు డయల్ 100కి కాల్‌చేయడంతో ఇన్స్పెక్టర్ జగన్నాథ్, సిబ్బందితో ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు మనోజ్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా కలశాల ఊరేగింపు

మనూరు, జూన్ 22: మండల పరిధిలోని ఎల్గోయి, అతిమ్యాల్‌లో గ్రామస్తులు ఆదివారం ఉదయం భూలక్ష్మీ అమ్మవారి పూజల్లో భాగంగా నిండు కలశాలతో ఊరేగింపు నిర్వహించి ఆలయల్లో పూజలు చేశారు. 'ఖేడ్' మండలం తుర్కపల్లిలో రెండు గ్రామాల ప్రజలు ఊరేగింపు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఎల్గోయి మాజీ సర్పంచ్ సుమనబాయి పాటిల్ తెలిపారు.

నల్లవాగు కట్టపై చెట్లపొదలు

నల్లవాగు మధ్యతరహా ప్రాజెక్ట్ కట్ట(బండ్)పై చెట్లు, ముళ్లపొదలు అల్లుకుపోయాయి. దీంతో కట్టకు దిగువన రైతుల పొలాల వైపు, ఎగువ భాగం ప్రాజెక్ట్ నీటి స్టోరేజీ వైపు పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరిగి అడవిని తలపిస్తోంది. అధికారులు మరింత నిర్లక్ష్యం వహిస్తే చెట్లు మరింత పెద్దగా పెరిగే అవకాశం ఉందని, ప్రాజెక్టులోకి విస్తరించే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. నీటిపారుదల శాఖ అధికారులు సిబ్బందితో జంగల్ కటింగ్ పనులు చేయించి చెట్లతో పాటు ముళ్లపొదలను తొలిగించాలని ఆయకట్టు రైతులు, స్థానిక ప్రజలు అధికారులను కోరుతున్నారు.

– సిర్గాపూర్, జూన్ 22

PUBLIC NOTICE

My clients 1) Sri Papillu Veera Chandra Shekhar Reddy S/o Veera Raghava Reddy R/o. H.No.20/780-1, co-operative colony, Cuddapah, A.P.-516001.
2) Derangula Ramchandra S/o late Derangula Venkatappa, R/o. H.No.86/226-6, Sivanandapuram, Mamillapalli, Charlapalle, Yerramukkapalli, Cuddapah, A.P-516004, I hereby declare that both parties purchasing the property of open land in Sy.No.51/P to an extent Ac.1-29 Gts and in Sy.No.50/P to an extent of Ac.0-11 Gts together total land to an extent of Ac.2.00 Gts situated at Maddikunta Mandal, Sada shivpet, Sangareddy Dist, T.G, from Smt. Pogula Neetha Reddy, W/o. Ashok Vardhan Reddy R/o. H.No.8-2-310/B/12/101, Anantha Residency, Road No.14 near Nandinagar bus stop, Navodaya Colony, Banjara Hills, Hyd, T.G, for which if anybody have any objection please contact us to the address mention below.

Sd/- **J.Nagarjun,** B.A, LL.B., Advocate
#16-1-24/368, LCH Saidabad Colony, Hyd.
Mob.No.8247305594, 9849010098.